క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

గార్ల: పట్టణంలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు రూ.16లక్షల వ్యయంతో నాలుగు 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మహేంద్రబాబు వెల్లడించారు. శుక్రవారం గార్లలోని బొడ్రాయి వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. మిగతా మూడు బాలికోన్నత పాఠశాల వద్ద, వాటర్‌ట్యాంక్, డోర్నకల్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే సమయంలో గార్ల పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ సాంబమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



నెల్లికుదురు: ప్రమాదవశాత్తు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కాల్వలో బోల్తా పడగా సిబ్బందికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మండలంలోని సంధ్య తండా బంజర గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజర గ్రామ పంచాయతీ తండాకు చెందిన ట్రాక్టర్ సంధ్యతండాకు వెళ్లి వస్తున్న క్రమంలో అదుపు తప్పి బొల్తా కొట్టింది. స్థానికులు వెంటనే బొల్తా కొట్టిన ట్రాక్టర్‌ను బయటకు తీశారు. ఈ ఘటనలో ఎవ్వరికి ఏ ప్రమాదం జరగలేదు.

రోడ్డు పనుల పరిశీలన



మహబూబాబాద్: మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న రోడ్ల మరమ్మతు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్, అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరిస్తారన్నారు.

ఆర్థికసాయం



కురవి: మండల కేంద్రంలో అమ్మను కోల్పోయి అనాథగా మారిన బాధిత బాలిక మానసకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత భరోసా కల్పించారు. శుక్రవారం ఆమె పెళ్లి రోజును పురస్కరించుకుని బాలిక మానసకు దుస్తులు, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొణతం విజయ్, నూతక్కి నర్సింహరావు, ముత్యం వెంకన్నగౌడ్, సంగెం భరత్, శ్రీనివాస్, రఘు, ప్రశాంత్, వేమిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ నిర్మాణం పూర్తి

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో 20రోజుల క్రితం రాత్రి గుర్తు తెలియని ఇసుక ట్రాక్టరు ఢీకొని పాఠశాల ప్రహరీ కూలిన విషయం తెలిసిందే. కాగా సదరు ట్రాక్టరు యజమాని పాఠశాల ప్రహరీ నిర్మాణం చేపట్టి శుక్రవారం పూర్తి చేయించాడు.

ప్రభుత్వ భూమిని సర్వే చేయాలి

నర్సింపేట: పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని భూమిని అధికారులు సర్వే చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కందికొండ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీబీఆర్పీ ఆధ్వర్యంలో ఆ సర్వే నంబర్ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఎంసీపీఐ(యూ) నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. భూమిని సర్వే చేసి పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు, జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందికట్ల సురేశ్, నాయకులు మిట్టగడపుల రజిత, భువనగిరి సుజాత, జన్ను మానస, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌తో చేపల వేట..!

- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువకులు
- ఇటీవల షాక్‌తో పలువురి మృతి
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు



చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు పెడుతున్న యువకులు (ఫైల్)

మరిపెడ రూరల్: ఒకప్పుడు మత్స్యకారులు మాత్రమే చేపలు పట్టి విక్రయించే వారు. కానీ మారుతున్న కాలానుగుణంగా ప్రతీ ఒక్కరు వివిధ పద్ధతులు ఉపయోగించి జలాశయాల్లో చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు వలలతో చేపలు పడుతుంటే, మరికొందరు మాత్రం విద్యుత్ తీగలను ఉపయోగించి చేపలను వేటాడుతున్నారు. అదే విద్యుత్ వారి పాలిట శాపంగా మారి విలువైన తమ ప్రాణాలు కోల్పోతున్న వైనం..

మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు, పాలేరు, మున్నేరు వాగులు ప్రవహిస్తున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పార్లాయి. ఇన్ని రోజులుగా ప్రవహించిన వాగులు ప్రస్తుతం వాటి ప్రవాహం తగ్గి వాగుల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. ఈ వాగు జలాశయాల్లో చేపలను పట్టేందుకు కొందరు యువకులు విద్యుత్ తీగలను ఉపయోగిస్తున్నారు. చేపల వేటాడుతూ నిత్యం ఏదో ఒక చోటు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

వ్యవసాయ మోటార్ల నుంచి..

వాగు పరివాహక ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల వద్ద అమర్చిన విద్యుత్ మోటార్ల వద్ద నుంచి విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. పగటి పూట రైతులు విద్యుత్ తీగలు అమర్చకుండా అడ్డుకుంటున్నారు. కానీ రాత్రి సమయంలో వెళ్లి కరెంట్ తీగలు పెట్టి వాగుల్లో చేపలు పడుతున్నారు. విద్యుత్ ప్రవాహంతో చేపల వేట చేపట్టి యువకులు ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కరెంట్ వైర్లలో విద్యుత్ ప్రసరిస్తుండగా నీటిలో షాక్ ఇస్తున్నారు. కరెంట్ షాక్ తగిలిన చేపలు చనిపోవడమో లేదా అస్వస్థతకు గురై ఒడ్డుకు తేలుతున్నాయి. ఇలా నీటిలో తేలియాడుతున్న చేపలను పట్టుకొని తీసుకు వెళ్తున్నారు.

కరెంట్ ప్లస్ వాటర్ విధానం డేంజర్..

'కరెంట్ ప్లస్ వాటర్' ఎంత డేంజరస్ కాంబినేషన్‌నో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ విధానంలో చేపలు పట్టే వారికి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. అవగాహన లోపంతో కరెంట్ వైర్లతో చేపలు పడుతూ పలువురు నీటిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన ఆబోతు ఎల్లయ్య (35) గ్రామ శివారు ఆకేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తులు చేపల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తానంచర్ల రెవెన్యూ పరిధిలోని వాల్యతండా గ్రామ పంచాయతీకి చెందిన బానోతు రమేష్ (38) చేపలు పడుతున్న క్రమంలో నీటిలో ఉన్న విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. ఇదే తరహాలో 2022లో మరిపెడ మండలం లచ్యతండ గ్రామ పంచాయతీ పరిధిలోని సోమ్లతండాకు చెందిన ఓ వ్యక్తి కరెంట్ తీగలతో చేపలు పడుతుండగా అదే షాక్‌కు గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆయా మృతుడి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

విద్యుత్‌తో చేపలు పడితే చర్యలు



జలశయాల్లో విద్యుత్ తీగలతో చేపలు పట్టినట్లు తమ దృష్టికి వస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. కేసులు కూడా నమోదు చేస్తాం. మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరికే చేపల కోసం వెళ్లి అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఎవరైన విద్యుత్ తీగలతో చేపల వేటకు వెళ్తే తమ దృష్టికి తేవాలన్నారు.

– షేక్ తహేర్‌బాబా, సబ్ ఇన్‌స్పెక్టర్, మరిపెడ

అన్ని రకాల విత్తనాలు అందించాలి



కేసముద్రం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను సబ్సిడీ కింద రైతులకు అందించాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బట్టు నాగేశ్వర్‌రావు, కొట్టం అంజయ్య మాట్లాడుతూ.. లాభాలే లక్ష్యంగా పనిచేసే ప్రైవేట్ విత్తన కంపెనీలు నాణ్యతలేని విత్తనాలను అధిక ధరలతో రైతులకు అంటగడుతున్నారని ఆరోపించారు. కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మే కంపెనీలపై వెంటనే చర్య తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేసి, అన్నిరకాల ధాన్యాలకు రూ.500 బోనస్ అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ దామోదర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెజ్జంకి బ్రహ్మచారి, అంబటి నాగమల్లు, హత్తిరాం, బండి రాజు, డి.రాజు, కొమురయ్య, మల్లయ్య, వీరయ్య, కృష్ణ, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బయ్యారంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, ఎన్డీ జిల్లా నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ మాట్లాడారు. రైతుల పంట రుణాలను మాఫీ చేయటంతోపాటు అన్నిరకాల ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, నర్సింహ, లింగన్న, నాగేశ్వరరావు, సమ్మయ్య, లింగమల్లు, సంగన్న, ఐలయ్య, యుగేంధర్, వీరభద్రం, తిరుమలేష్, మంగీలాల్, రాకేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట' పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాధవ్

పెద్దవంగర: సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టుతుందని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలుశాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3నుంచి 19వరకు పకడ్బందీగా నిర్వహించేలా ప్రతీ ఒక్కరు తమవంతు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ విద్య సంవత్సరం కూడా పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనంతరం మండలంలోని పలు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఏఈ అశోక్‌తో కలసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, నోడల్ అధికారి కళాధర్, ఏపీఎం రమణాచారి, ఐసీడీఎస్ అధికారి కవిత, జీపీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి హరితహారం చెట్లు ఆహుతి



రోడ్ల వెంబడి మాడిపోయి దర్శనమిస్తున్న హరితహారం చెట్లు

చిన్నగూడూరు: గత ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా రోడ్ల వెంబడి పెంచిన చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మండలంలోని జయ్యారం–చిన్నగూడూరు రోడ్డు మార్గంలో రైతులు వ్యవసాయ వ్యర్థాలను రోడ్ల పక్కన పోసి ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో హరితహారం చెట్లు మంటల్లో కాలిపోయి మాడిపోయి దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ వ్యర్థాలపై అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

లీకేజీలు.. పగుళ్లు.. రిపేర్లు

- తరుచూ పగులుతున్న తాగునీటి పైపులు
- నిత్యం నీటి సరఫరాకు అంతరాయం



యాదవనగర్‌లో మరమ్మతు చేస్తున్న సిబ్బంది

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేసే పైపులు నిత్యం లీకవుతుండటం, పగులుతుండటంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల క్రితం భూమిలో ఏర్పాటు చేసిన పైపులైన్లు కావడం, కొన్ని చోట్ల నాసిరకం పైపులు ఏర్పాటు చేయడం, కొన్ని ప్రాంతాల్లో పైపులైన్ ఉన్న ప్రదేశంలో భారీ వాహనాల రాకపోకలు సాగడంతో పైపులు, పగలడం, లీకవడం జరుగుతోంది. పైపులు పగిలిన ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోతుంది. తక్కువ నీరు సరఫరా అవుతుంది. పైపులు లీకైన ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడటం పైపుల ద్వారా లీకైన నీరంతా కలుషితమై తిరిగి అదే పైపు ద్వారా తాగునీటిలో కలుస్తుండటంతో మురుగునీరు సరఫరా అవుతోంది. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోవులకు దాణా పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

తొర్రూరు: ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు నడిగడ్డ శైలజ అన్నారు. స్థానికులు నడిగడ్డ యాదగిరి, శివాని ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని శివయాద్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని గోశాలలో గోవులకు దాణా, కూరగాయలు అందించారు. శైలజ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలతోనే జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, స్థానికులు నడిగడ్డ సంపత్, వెంకట్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?



ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

పెద్దవంగర: మండల కేంద్రంలోని మసీదు వీధిలోని రామకృష్ణ సర్కిల్‌లో ఓ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇంటివాసులు అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన ఫలితం లేదని ఇంటి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగకముందే స్పందించి తీగలను తొలగించాలని కోరుతున్నారు. వేసవి కాలం కావడంతో రాత్రి వేళల్లో పల్లెల్లో సహజంగా ఇంటి స్లాబ్‌లపై నిద్రిస్తుంటారు. అధికారులు వెంటనే 2ఫేస్ వైరుతోపాటు సపోర్టు తీగలను తొలగించాలని బాధితుడు గాదరబోయిన సాయిలు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు



మహబూబాబాద్ రూరల్: తనిఖీ చేస్తున్న అధికారులు



కురవి: తనిఖీ చేస్తున్న సీరోలు ఎస్సై, ఏఓ

మహబూబాబాద్ రూరల్: విత్తనాలు, పురుగుమందుల డీలర్లు రైతులకు నాసిరకం విత్తనాలు నమ్మితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏడీఏ లక్ష్మీనారాయణ, టౌన్ సీఐ దేవేందర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పలు విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మీనారాయణ, టౌన్ సీఐ దేవేందర్, మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు దుకాణాల్లో ఉన్న పత్తి, మిరప, వరి విత్తనాలను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు సందర్భంగా రైతులు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బయ్యారం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్‌పై పీడీయాక్ట్ నమోదు చేసి లైసెన్సును రద్దు చేస్తామని ఏఓ రాంజీ, ఎస్సై ఉపేందర్ అన్నారు. బయ్యారంలోని పలు విత్తనాలషాపులను శుక్రవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లతో మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు, గుర్తింపు లేని కంపెనీ విత్తనాలు, మొబైల్ వాహనాల ద్వారా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం తహసీల్దార్ నాగరాజు, ఎస్సై సతీష్, ఏఈఓ రామకృష్ణ తనిఖీ చేశారు. షాపుల్లో లైసెన్స్‌లు, బిల్ బుక్స్, రైతు విక్రయ నమోదు రిజిస్టర్, స్టాక్ రిజిష్టర్, స్టాక్ బోర్డు వివరాలను పరిశీలించారు.

కురవి: సీరోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని సూదనపల్లి, మోద్గులగూడెం తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కురవి ఎస్సై బి.గోపి, ఏఓ ఆధ్వర్యంలో కురవిలో షాపులను తనిఖీ చేశారు. షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మంజుఖాన్, ఎస్సైలు విజయ్‌రాంకుమార్, బి.గోపి మాట్లాడుతూ.. షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంతాలపల్లి: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఫర్టిలైజర్ షాపుల యజమానులు తప్పకుండా రశీదు ఇవ్వాలని ఎస్సై కరుణాకర్, మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కుమార్‌యాదవ్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పలు ఎరువులు, విత్తనాల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాక్రమంలో పోలీస్ సిబ్బంది, మధు, వెంకన్న , తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే విక్రయించాలని తహసీల్దార్ దామోదర్, ఎస్సై వంశీధర్, ఏఓ వెంకన్న అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తనాల సరఫరా, విత్తనాలు అమ్మేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డీలర్లతో సమావేశం నిర్వహించారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి

చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ గ్రామ పరిధిలోని అక్కల్‌చెరువు శిఖం భూమిని కాపాడాలని మగ్ధుంపురం పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు బోనగిరి స్వామి, ముదిరాజ్ కుల పెద్దమనిషి ముత్యం యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఫణికుమార్‌కు స్వామి, యాకయ్య ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం వినతిపత్రం అందించింది. అనంతరం స్వామి, యాకయ్య మాట్లాడారు. సర్వే నంబర్ 245లో 40.25 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. ఇటీవల చెరువు సమీపంలో భూమి కొన్న కొందరు రైతులు చెరువులో మొరం పోసి పూడ్చి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. చెరువులో మట్టిపోసి ఆక్రమించడంతో నీటి మట్టం తగ్గి ఆయకట్టు సాగుకు ఇబ్బంది తలెత్తుతోందని చెప్పారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు పెద్దమ్మల రాజేందర్, ముత్యం వీరస్వామి, రాజయ్య, రమేశ్, డైరెక్టర్లు భద్రయ్య, సదానందం , రాజు, మహేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేసముద్రం: ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన చిర్రగాని యాదగిరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చాడు. ఆయన వెంట జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం యాకయ్య, భిక్షపతి, యాకమూర్తి ఉన్నారు.

'ఉద్యోగ విరమణ సహజం'



మహబూబాబాద్ రూరల్: శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ



నెహ్రూసెంటర్: వసంతరాణిని సన్మానిస్తున్న డీఎంహెచ్ఓ



నెహ్రూసెంటర్: పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎం

మహబూబాబాద్ రూరల్: పోలీసు రిటైర్‌మెంట్ కేవలం ఉద్యోగుల వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కొనియాడారు. ట్రాఫిక్ ఎస్సై పి.శ్యాంసుందర్ పదవి విరమణ వీడ్కోలు అభినందన కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ అన్నారు. టీజీ ఆర్టీసీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగు విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం డిపో ఆవరణలో నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన డి.వెంకన్న, జగన్‌మోహన్, వెంకటేశ్వర్లు, ఎస్ఎన్ రావులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్యాం ప్రసాద్, రుక్మిణి, మల్లిఖార్జున్, ఈఎస్ చారీ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీహెచ్ఎన్ వీర వసంతరాణి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, వెస్ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఏడీ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కేసముద్రం: ప్రతీ ఒక్కరు వృత్తిరీత్యా అంకితభావంతో పనిచేస్తే, సమాజంలో వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ వోలం చంద్రమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసిన పాశం లక్ష్మయ్య పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవికుమార్, సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఏపీఎం రాజీర్, ఏపీఓ ప్రదీప్, కార్యదర్శులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

వికాస్‌నగర్‌లో చోరీ



జనగామ: పట్టణంలోని వికాస్‌నగర్‌కు చెందిన ఎండీ అమ్జద్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాలు.. తరిగొప్పుల ప్రభుత్వ పాఠశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న అమ్జద్, నానమ్మ కాలు విరుగగా, పరామర్శించేందుకు ఈ నెల 30వ తేదీన కుటుంబ సమేతంగా వరంగల్ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు, తలుపులు తెరిచి లోపలకు వెళ్లి బీరువా పగుల గొట్టారు. అందులోని 810 గ్రాముల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు అమ్జద్ కన్నీటి పర్యంతమయ్యారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పట్టణంలో వరుస దొంగతనాలు మొదలు కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.